క్లుప్తంగా

చిన్నారుల సైకిల్ ర్యాలీ



సైకిల్ ర్యాలీని ప్రారంభిస్తున్న నిర్వాహకులు

గోపాలపట్నం: జాతీయ సమగ్రతను చాటుతూ జీవీఎంసీ 90వ వార్డు విమాన్‌నగర్‌లో జాతీయ జెండాలతో చిన్నారులు సైకిల్ ర్యాలీ నిర్వహించారు. ఇంట్రాక్ట్ ఆఫ్ వైజాగ్ చిల్డ్రన్ ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం జరిగింది. విమాన్‌నగర్ వీసీసీ నాయకురాలు లీల మాట్లాడుతూ చిన్నారుల్లో దేశ భక్తిని పెంపొందించేందుకు ఈ ర్యాలీ చేపట్టామన్నారు. మనది భిన్నత్వంలో ఏకత్వం కలిగిన దేశమని కొనియాడారు. కార్యక్రమంలో రోషన్, ఐద్వా నాయకురాలు ప్రభావతి, అన్నపూర్ణ తదితరులు పాల్గొన్నారు.

మంత్రి బొత్సకు సాదర స్వాగతం



విమానాశ్రయం నుంచి బయటకు వస్తున్న మంత్రి బొత్స

గోపాలపట్నం: విద్యాశాఖ మంత్రి బొత్స సత్యనారాయణకు విశాఖ విమానాశ్రయంలో సాదర స్వాగతం లభించింది. గన్నవరం నుంచి విశాఖకు సోమవారం సాయంత్రం వచ్చిన మంత్రికి డిప్యూటీ మేయర్ జియ్యాని శ్రీధర్ విమానాశ్రయంలో స్వాగతం పలికారు.

విద్యార్థులకు పోటీలు



చిత్రలేఖన పోటీలను పర్యవేక్షిస్తున్న హెచ్‌ఎం శ్రీనివాసరావు

కంచరపాలెం: స్వాతంత్ర్య దినోత్సవాన్ని పురస్కరించుకుని 56వ వార్డు కంచరపాలెం కూడలిలోని రామ్మూర్తిపంతులుపేట ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు సోమవారం వివిధ అంశాల్లో పోటీలు నిర్వహించారు. బీఎస్ఆర్ ట్రస్ట్ ఆధ్వర్యంలో నిర్వహించిన చిత్రలేఖనం, వక్తృత్వం, వ్యాసరచన పోటీల్లో విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొన్నారు. పాఠశాల ప్రధానోపాధ్యాయుడు ఆర్.శ్రీనివాసరావు, ఉపాధ్యాయులు గొట్టివాడ వెంకటరమణ, ఎన్.ఎస్. శంకర్ పోటీలను పర్యవేక్షించారు. విజేతలకు మంగళవారం జరిగే వేడుకల్లో బహుమతులు అందజేయనున్నట్లు ట్రస్ట్ సభ్యులు తెలిపారు.

నేడు స్వర్ణపుష్పార్చన

దాబాగార్డెన్స్: బురుజుపేటలో కొలువైన కనక మహాలక్ష్మి అమ్మవారికి 108 స్వర్ణ పుష్పాలతో మంగళవారం అష్టదళ పద్మారాధన నిర్వహించనున్నారు. ఉదయం 7 నుంచి 8 గంటల వరకు జరిగే ఈ ప్రత్యేక పూజలో పాల్గొనదలచే భక్తులు రూ.1,116 చెల్లించి పేర్లు నమోదు చేసుకోవాలి. వివరాలకు 0891-2711725, 2566514 నంబర్లకు ఫోన్ చేయవచ్చు.

ప్రతీ వార్డును ఆదర్శవంతంగా తీర్చిదిద్దుతాం

- వైఎస్సార్‌సీపీ 'పశ్చిమ' సమన్వయకర్త ఆడారి
- 60వ వార్డులో రూ.49లక్షలతో అభివృద్ధి పనులకు శ్రీకారం



సీసీ, బీటీ రోడ్డు నిర్మాణ పనులకు శంకుస్థాపన చేస్తున్న ఆడారి

మల్కాపురం: నియోజకవర్గ పరిధిలోని ప్రతీ వార్డును అభివృద్ధి చేసి, ఆదర్శవంతంగా తీర్చిదిద్దుతామని ఏపీ ఎంఎస్ఎంఈ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ చైర్మన్, వైఎస్సార్‌సీపీ పశ్చిమ నియోజకవర్గ సమన్వయకర్త ఆడారి ఆనంద్‌కుమార్ అన్నారు. 60వ వార్డు కోరమాండల్ వద్ద గల శ్మశాన వాటిక రోడ్డు నుంచి బర్మాకాలనీ వరకు గల మార్గంలో బీటీ రోడ్డు, అలాగే ఇదే వార్డు పరిధి హరిహర క్షేత్రం వద్ద సీసీ రోడ్డు నిర్మాణ పనులకు సోమవారం శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో భాగంగా హనుమాన్ సంజీవ్‌కాలనీ, బర్మాకాలనీ, శ్మశానవాటిక మార్గంలో పర్యటించినప్పుడు స్థానికులు బీటీ రోడ్డు వేయాలని కోరారన్నారు. వారి విజ్ఞప్తి మేరకు రూ.49 లక్షలతో బీటీ రోడ్డు పనులకు సోమవారం భూమి పూజ చేసినట్లు చెప్పారు. మాట ఇస్తే దానికి కట్టుబడే పార్టీ వైఎస్సార్‌సీపీ అన్నారు. కొంతమంది మాదిరిగా శిలాఫలకాలపై పేర్లు రాయించుకుని, అభివృద్ధి పనులు చేయడం మరిచే గుణం తమకు లేదన్నారు. మాట ఇస్తే చేసి తీరతామన్నారు. అలాగే, ఈ వార్డులో మరో 5 నెలల్లో మరిన్ని కోట్ల రూపాయలతో అభివృద్ధి పనులు చేపడతామని చెప్పారు. వైఎస్సార్ ట్రేడ్ యూనియన్ జిల్లా అధ్యక్షుడు కలిదిండి బద్రీనాథ్ పర్యవేక్షణలో జరిగిన కార్యక్రమంలో మళ్ల ధనలత, అంగ రామ్‌ప్రసాద్, నరేష్, బిల్డర్ శ్రీను, కొల్లి నూకరెడ్డి, మనోహర్, భాస్కర్ రావు, ఆడారి హరీష్ తదితరులు పాల్గొన్నారు.

'కోరమాండల్' సేవలు ప్రశంసనీయం

- వైఎస్సార్‌సీపీ పశ్చిమ సమన్వయకర్త ఆడారి
- 60, 58 వార్డుల్లో సామాజిక భవనాలు ప్రారంభం



సామాజిక భవనాన్ని ప్రారంభిస్తున్న ఆనంద్‌కుమార్

మల్కాపురం: పారిశ్రామిక ప్రాంతంలో స్థానిక కోరమాండల్ ఇంటర్నేషనల్ సంస్థ అందిస్తున్న సేవలు ప్రశంసనీయమని ఎంఎస్ఎంఈ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ చైర్మన్, వైఎస్సార్‌సీపీ పశ్చిమ నియోజకవర్గ సమన్వయకర్త ఆడారి ఆనంద్‌కుమార్ అన్నారు. 60వ వార్డు హనుమాన్ సంజీవ్ కాలనీ కొండ ప్రాంతం వద్ద కోరమాండల్ సంస్థ సీఎస్ఆర్ నిధులు రూ.30లక్షలతో నిర్మించిన సామాజిక భవనాన్ని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆడారి మాట్లాడుతూ శిథిలావస్థలో ఉన్న సామాజిక భవనాన్ని తొలగించి, ఆ స్థానంలో ఆధునిక వసతులతో మినీ కల్యాణమండపంగా భవనాన్ని తీర్చిదిద్దడం అభినందనీయమన్నారు. సంస్థ తన సేవలను వార్డుల్లో మరింత విస్తరింపజేయాలని కోరారు. కార్యక్రమంలో కార్పొరేటర్ పి.వి.సురేష్, కోరమాండల్ జనరల్ మేనేజర్(హెచ్ఆర్) రెడ్డిపల్లి శ్రీనివాసరావు, ట్రేడ్ యూనియన్ నాయకుడు బద్రీనాథ్, కోరమాండల్ డీజీఎం వెంకటరమణ, సీఎస్ఆర్ ప్రతినిధి ధర్మాల వేణుగోపాలరెడ్డి, గ్రామ కమిటీ ప్రతినిధులు పాల్గొన్నారు.

58వ వార్డులో..

58వ వార్డు గొందేశివానిపాలెం వద్ద కోరమాండల్ సహకారంతో నిర్మించిన సామాజిక భవనాన్ని ఆడారి ఆనంద్‌కుమార్ ప్రారంభించారు. కార్పొరేటర్ గులిగిందల లావణ్య, స్థానిక నాయకులు పాల్గొన్నారు.

క్రీడలతో మానసిక ఉల్లాసం



విజేతలకు బహుమతులు అందిస్తున్న షిప్‌యార్డ్ డైరెక్టర్ రాంబాబు

సింథియా: క్రీడలతో మానసిక ఉల్లాసం లభిస్తుందని షిప్‌యార్డ్ ఫైనాన్స్ అండ్ కమర్షియల్ డైరెక్టర్ ఎస్.వి.రాంబాబు అన్నారు. స్వాతంత్ర్య దినోత్సవాన్ని పురస్కరించుకుని హిందూస్థాన్ షిప్‌యార్డ్ వెల్ఫేర్ అండ్ స్పోర్ట్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఆదివారం వాలీబాల్, టేబుల్ టెన్నిస్ పోటీలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన విజేతలకు బహుమతులు అందజేశారు. వాలీబాల్‌లో హాల్‌అవుట్ ఫిట్ విభాగానికి చెందిన జట్టు విన్నర్‌గా నిలవగా, డిజైన్ విభాగానికి చెందిన జట్టు రన్నర్‌గా నిలిచింది. ఇక టేబుల్ టెన్నిస్ పోటీల్లో బిజినెస్ డెవలప్‌మెంట్ విభాగానికి చెందిన జట్టు విజేతగా నిలిచింది. కార్యక్రమంలో షిప్‌యార్డ్ వెల్ఫేర్ అండ్ స్పోర్ట్స్ సొసైటీ చైర్మన్ భేగ్, ఇతర ఉన్నతాధికారులు, ఉద్యోగులు, కార్మికులు పాల్గొన్నారు.

అప్పన్నకు విశేషంగా ఆర్జిత సేవలు



గరుడసేవ నిర్వహిస్తున్న అర్చకులు

సింహాచలం: వరాహ లక్ష్మీనృసింహస్వామికి సోమవారం ఆర్జిత సేవలు విశేషంగా జరిగాయి. ఉదయం 9.30 గంటల నుంచి నిత్యకల్యాణం ఘనంగా జరిగింది. ఆలయ కల్యాణ మండపంలోని వేదికపై స్వామివారి ఉత్సవమూర్తులు గోవిందరాజస్వామి, శ్రీదేవి,భూదేవిలను అధిష్ఠంపజేశారు. అర్చకుడు పెద్దరాజు తదితరులు విష్వక్సేనపూజ, పుణ్యాహవచనం, సంకల్పం, కంకణధారణ, యజ్ఞోపవీతం, జీలకర్రబెల్లం, మాంగళ్యధారణ, తలంబ్రాలు ఘట్టాలతో కల్యాణం నిర్వహించారు. ఉభయదాతలకు స్వామివారి ప్రసాదం, శేషవస్త్రాలు అందజేశారు.

- శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామికి సోమవారం గరుడసేవ వైభవంగా జరిగింది. స్వామివారి ఉత్సవమూర్తి గోవిందరాజస్వామిని వెండి గరుడవాహనంపై అధిష్ఠంపజేశారు. అష్టోత్తర శతనామావళి పూజ చేసి భక్తులను గరుడవాహనం చుట్టూ ప్రదక్షిణ చేయించారు. విశేషంగా హారతులు అందజేశారు. అర్చకులు శ్రీకాంత్ తదితరులు ఈకార్యక్రమాన్ని నిర్వహించారు.

అభివృద్ధి పనుల పరిశీలన



ముస్లిం శ్మశానవాటికలో అధికారులతో మాట్లాడుతున్న డిప్యూటీ మేయర్ జియ్యాని శ్రీధర్

గోపాలపట్నం: జీవీఎంసీ 52వ వార్డులో డిప్యూటీ మేయర్ జియ్యాని శ్రీధర్ సోమవారం పర్యటించారు. ఇక్కడి పార్కులు, గ్రీన్ బెల్టులు, శ్మశాన వాటికల్లో చేపడుతున్న పనులను స్వయంగా పరిశీలించి అధికారులతో సమీక్షించారు. శ్మశాన వాటికలో మౌలిక సదుపాయాలు కల్పించాలని అధికారులకు సూచించారు. తారకరామ వుడా అపార్ట్‌మెంట్‌లో పార్క్ కళావేదిక పనులు పరిశీలించారు. వార్డు పరిధిలోని గ్రీన్ బెల్టులు, పార్కుల సుందరీకరణ, మౌలిక వసతుల కల్పనకు అవసరమైన ప్రణాళికలు తయారు చేయాలని అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో ఏఈ ఉష, వర్క్ ఇన్‌స్పెక్టర్ బాల కృష్ణ, శానిటరీ అధికారులు పాల్గొన్నారు.

ప్రతీ ఇంటికీ సంక్షేమ ఫలాలు



ప్రభుత్వ పథకాలను తెలిపే కరపత్రాలను లబ్ధిదారులకు అందిస్తున్న ఆడారి ఆనంద్‌కుమార్

సింథియా: ప్రజా సంక్షేమమే లక్ష్యంగా సీఎం జగన్ మోహన్‌రెడ్డి సుపరిపాలన అందిస్తున్నారని వైఎస్సార్‌సీపీ పశ్చిమ నియోజకవర్గ సమన్వయకర్త ఆడారి ఆనంద్‌కుమార్ అన్నారు. కుల,మత, రాజకీయాలకు అతీతంగా ప్రతీ ఇంటికి సంక్షేమ పథకాలను అందిస్తున్న ఘనత ఆయనకే చెందుతుందన్నారు. 62వ వార్డు ఇండస్ట్రియల్ కాలనీ-2 సచివాలయ పరిధిలో కార్పొరేటర్, జీవీఎంసీ స్టాండింగ్ కమిటీ సభ్యుడు బల్ల లక్ష్మణరావు ఆధ్వర్యంలో సోమవారం గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో పాల్గొన్న ఆడారి ఆనంద్ కుమార్ ఇండస్ట్రియల్ కాలనీ-2లో ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలను, ప్రజలకు చేకూరిన లబ్ధిని వివరించారు. ప్రజల నుండి వచ్చిన సమస్యలను సంబంధిత అధికారులకు తెలియజేసి సత్వరమే పరిష్కరించాలని ఆదేశించారు. కార్యక్రమంలో యూత్ అధ్యక్షుడు సూరాడ అనుదీప్, పీలా అనంత్, సచివాలయ కన్వీనర్లు రామకృష్ణ, పెద్దాడ ప్రసాద్, సోషల్ మీడియా కో- కన్వీనర్ తంతటి సంపత్, చంటి, మహిళా నాయకురాలు మసేనమ్మ, వివిధ విభాగాల సిబ్బంది పాల్గొన్నారు.

ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి



ప్రజలతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే అదీప్‌రాజ్

గోపాలపట్నం: ప్రజా సమస్యలు తెలుసుకుని వాటిని పరిష్కరించడానికే గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహిస్తున్నట్టు ఎమ్మెల్యే అన్నంరెడ్డి అదీప్‌రాజ్ అన్నారు. జీవీఎంసీ 88వ వార్డు కోటనరవలో సోమవారం గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన ఇంటింటికీ వెళ్లి నాలుగేళ్లుగా ప్రభుత్వం అందించిన సంక్షేమ పథకాలను వివరించారు. ప్రజలతో మాట్లాడి సమస్యలు తెలుసుకున్నారు. కార్యక్రమం పూర్తయిన తర్వాత మంజూరయ్యే రూ.20 లక్షలతో అవసరమైన పనులు చేపడతామని హామీ ఇచ్చారు. జీవీఎంసీ నిధులతో ప్రధాన రహదారులు నిర్మిస్తున్నామని తెలిపారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకులు గండ్రెడ్డి మహాలక్ష్మి నాయుడు, దాడి నూకరాజు, మల్ల రమణ, మల్ల నూక అప్పారావు, శరగడం జగదీష్, అప్పారావు, కొయిడాల రామసూరి, వేగి శ్రీరామ్మూర్తి తదితరులు పాల్గొన్నారు.

మెగా రక్తదాన శిబిరానికి విశేష స్పందన



శిబిరంలో పాల్గొన్న ఐలా, వాసీవా, లఘు ఉద్యోగ భారతి ప్రతినిధులు

అక్కిరెడ్డిపాలెం: రక్తదానం ప్రాణదానంతో సమానమని వాసీవా అధ్యక్షుడు సజ్జా పాండురంగ ప్రసాద్ అన్నారు. సోమవారం ఆటోనగర్‌లోని ఐలా భవనంలో ఆటోనగర్ స్మాల్ స్కేల్ ఇండస్ట్రియలిస్ట్స్ వెల్ఫేర్ అసోసియేషన్ (వాసీవా), ఏపీఐఐసీ-ఇండస్ట్రియల్ ఏరియాస్ లోకల్ అథారిటీస్, లఘు ఉద్యోగ భారతి సంయుక్తంగా రోటరీ బ్లడ్ సెంటర్, లయన్స్ బ్లడ్ బ్యాంక్ సహకారంతో మెగా రక్తదాన శిబిరం నిర్వహించారు. పలువురు పారిశ్రామిక వేత్తలు, కార్మికులు, ఉద్యోగులు ఈ శిబిరంలో పాల్గొన్నారు. వాసీవా అధ్యక్షుడు సజ్జా పాండురంగ ప్రసాద్ రక్తదానం చేశారు. ఆయన ఇప్పటి వరకు 40 సార్లు రక్తదానం చేసినట్లు పేర్కొన్నారు. ఆరోగ్యవంతులందరూ అపోహలు వీడి, రక్తదానం చేయాలని కోరారు. శిబిరంలో 100 యూనిట్ల రక్తాన్ని సేకరించారు. కార్యక్రమంలో ఏపీఐఐసీ డీజెడ్‌ఎం, ఐలా కమిషనర్ కె.సూర్యనారాయణ, ఇన్‌చార్జి చైర్మన్ కొల్లి ఈశ్వరరావు, కార్యదర్శి చీకటి సత్యనారాయణ, ఐలా డీ ఎక్స్‌పెన్షన్ మెంబర్ అశోక్ రాజు, లఘు ఉద్యోగ భారతి రాష్ట్ర అధ్యక్షుడు ఎ.కె.బాలాజీ, జిల్లా అధ్యక్షుడు అట్లూరి రమేష్, వాసీవా కార్యదర్శి రాంప్రసాద్, ప్రతినిధి అనార్‌బాబు, లయన్స్ బ్లడ్ బ్యాంక్, రోటరీ బ్లడ్ సెంటర్ సిబ్బంది పాల్గొన్నారు.

ఉరి వేసుకుని భెల్ కార్మికుడు మృతి



నర్సింగరావు (ఫైల్)

అక్కిరెడ్డిపాలెం: బీహెచ్ఈఎల్ కార్మికుడు ఉరి వేసుకుని ఆత్మహత్యకు పాల్పడిన ఘటన గాజువాక పోలీస్ స్టేషన్ పరిధిలో జరిగింది. గాజువాక ఎస్ఐ ఎం.రవికుమార్, మృతుని కుటుంబ సభ్యులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. బీహెచ్ఈఎల్ హెచ్‌సీ విభాగంలో వెల్డర్‌గా పని చేస్తున్న మడుతూరు నర్సింగరావు (53) భార్య జయంతి, ఇద్దరు పిల్లలతో భెల్ టౌన్‌షిప్ క్వార్టర్ ఎస్-41లో నివసిస్తున్నారు. కుమార్తె మాధవీలత ఇంజినీరింగ్ పూర్తి చేసి ప్రైవేట్ జాబ్ చేస్తుండగా, కుమారుడు ఆదర్శ్ బీటెక్ పూర్తి చేశాడు. నర్సింగరావు కొద్దికాలంగా మద్యానికి బానిసై విధులకు గైర్హాజరు అవుతున్నాడు. సోమవారం మధ్యాహ్నం భార్య, కుమార్తెతో బాగానే ఉన్నాడు. కుమారుడు ఆదర్శ్ కంటి పరీక్షల నిమిత్తం బయటికి వెళ్లాడు. ఆ సమయంలో నర్సింగరావు హఠాత్తుగా ఇంటికి ఆనుకొని ఉన్న షెడ్డులోకి వెళ్లి షెడ్డు హుక్కుకు ఉరివేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. కొంతసేపటికి హుక్కుకు వేలాడుతున్న నర్సింగరావును చూసిన అతని భార్య, కుమార్తె ఊహించని పరిణామంతో ఆందోళనకు గురయ్యారు. స్థానికుల సాయంతో నర్సింగరావును కిందకు దించి, స్థానికంగా ఉన్న భెల్ ఆస్పత్రికి తరలించారు. అతను మృతి చెందాడని వైద్యులు తెలపడంతో, పోస్టుమార్టం నిమిత్తం కేజీహెచ్‌కు తరలించారు. సమాచారం అందుకున్న గాజువాక ఎస్ఐ ఎం.రవికుమార్ మృతుని నివాసానికి చేరుకుని వివరాలు సేకరించారు. మృతుని కుటుంబ సభ్యుల పిర్యాదుతో కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నారు.

17నుంచి సీపీఐ బస్సు యాత్ర



బస్సు యాత్ర పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న స్టాలిన్ తదితరులు

గాజువాక: కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అనుసరిస్తున్న విధానాలకు వ్యతిరేకంగా ఈ నెల 17 నుంచి బస్సు యాత్రను నిర్వహించనున్నట్లు సీపీఐ రాష్ట్ర కంట్రోల్ కమిషన్ సభ్యుడు ఎ.జె.స్టాలిన్ తెలిపారు. యాత్ర పోస్టర్‌ను గాజువాకలో సోమవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ సీపీఐ రాష్ట్ర సమితి ఆధ్వర్యంలో ఈ బస్సు యాత్రను కూర్మన్నపాలెం జంక్షన్‌లోని విశాఖ ఉక్కు కార్మికుల దీక్ష శిబిరం వద్ద ఏఐటీయూసీ జాతీయ ప్రధాన కార్యదర్శి అమర్జీత్ కౌర్ ప్రారంభిస్తారని తెలిపారు. వచ్చేనెల 8వ తేదీ వరకు యాత్ర రాష్ట్రంలోని అన్ని జిల్లాల్లో యాత్ర కొనసాగుతుందని, తిరుపతిలో ముగింపు సభ ఉంటుందని తెలియజేశారు. కార్యక్రమంలో సీపీఐ నాయకులు కసిరెడ్డి సత్యనారాయణ, ఎల్లేటి శ్రీనివాసరావు, జి.ఆనంద్, కె.అచ్యుతరావు, ఉక్కు ఏఐటీయూసీ నాయకులు కె.ఎస్.ఎన్.రావు, చీకటి శ్రీనివాసరావు, పప్పు అప్పారావు తదితరులు పాల్గొన్నారు.

అందరి కృషితో కాలుష్య నియంత్రణ



ఆటోలో కార్యాలయానికి చేరుకున్న మేయర్ గొలగాని హరివెంకటకుమారి



తన బంగ్లా నుంచి సైకిల్‌పై కార్యాలయానికి వస్తున్న జీవీఎంసీ కమిషనర్ సాయికాంత్ వర్మ

దాబాగార్డెన్స్: కాలుష్య నియంత్రణ అందరి సామాజిక బాధ్యతని మేయర్ గొలగాని హరివెంకటకుమారి పేర్కొన్నారు. కాలుష్య నియంత్రణలో భాగంగా మేయర్ సోమవారం తమ సొంత వాహనం వదలి క్యాంప్ ఆఫీస్ నుంచి ఆటోలో ప్రయాణించి జీవీఎంసీ కార్యాలయానికి చేరుకున్నారు. జీవీఎంసీ కమిషనర్ సాయికాంత్ వర్మ తన బంగ్లా నుంచి సైకిల్‌పై కార్యాలయానికి వచ్చారు. అనంతరం జీవీఎంసీలో నిర్వహించిన డయల్ యువర్ మేయర్, జగనన్నకు చెబుదాం(స్పందన) కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ నగరంలో వాయు, శబ్ద కాలుష్యం పెరిగిపోయిందని, వాటి నియంత్రణకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని కోరారు. నగరంలో ప్రైవేట్, ప్రభుత్వ సంస్థల యాజమాన్యాలు వారంలో ఒక్క రోజు ప్రజా రవాణాను వారి సిబ్బందితో ఉపయోగించేలా చూడాలన్నారు. సాధ్యమైనంత వరకు విద్యుత్ వాహనాలు ఉపయోగించాలని మేయర్, కమిషనర్ సూచించారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి



శ్రీనివాస్ వరప్రసాద్ (ఫైల్)

కూర్మన్నపాలెం: ద్విచక్ర వాహనంపై వెళ్తున్న వ్యక్తి ఆయిల్ ట్యాంకర్ వెనుక చక్రాల కిందపడి మృతి చెందాడు.ఈ సంఘటనకు సంబంధించి దువ్వాడ సీఐ శ్రీనివాసరావు తెలిపిన వివరాలు.. వడ్లపూడి పరిధి ఈసీఎస్ గార్డెన్స్ గణేష్‌నగర్‌కు చెందిన తోట శ్రీనివాస్‌వరప్రసాద్(70) ట్రాన్స్‌పోర్ట్ ఆఫీస్ నడుపుతూ కుటుంబాన్ని పోషిస్తున్నాడు. సోమవారం ఉదయం ట్రాన్స్‌పోర్ట్ ఆఫీస్‌కు తన ద్విచక్ర వాహనంపై వెళ్తున్నాడు. ఈ క్రమంలో కూర్మన్నపాలెం జంక్షన్ వద్ద వచ్చేసరికి గాజువాక నుంచి అనపకాపల్లి వెళ్తు న్న ఆయిల్ ట్యాంకర్ పక్క నుంచి వెళ్లడంతో శ్రీనివాస్ వరప్రసాద్ నడుపుతున్న ద్విచక్రవాహనానికి తగలడంతో జారిపడి ఆయిల్ ట్యాంకర్ వెనుక చక్రాల కింద పడిపోయారు. దీంతో తలకు తీవ్ర గాయమై అధిక రక్తస్రావం కావడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. దువ్వాడ పోలీసులు మృతదేహాన్ని పోస్ట్‌మార్టం నిమిత్తం కేజీహెచ్‌కు తరలించారు. భార్య వెంకటలక్ష్మికుమారి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

'డిపెండెంట్స్'కు వైద్య సదుపాయాలపై వినతి



స్టీల్‌ప్లాంట్ పర్సనల్ డైరెక్టర్ పాండేకు వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

ఉక్కునగరం: స్టీల్‌ప్లాంట్ ఉద్యోగులపై ఆధారపడిన కుటుంబ సభ్యుల (డిపెండెంట్స్)కు వైద్యం అందించే సమయంలో ఆస్పత్రి యాజమాన్యం సృష్టిస్తున్న సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని స్టీల్ సీఐటీయూ నాయకులు కోరారు. ఈ మేరకు స్టీల్‌ప్లాంట్ డైరెక్టర్ (పర్సనల్) డాక్టర్ ఎస్.సి. పాండేను సోమవారం కలిసి వినతిపత్రం అందజేశారు. డిపెండెంట్ అని డిపార్ట్‌మెంట్ పర్సనల్ అధికారులు ధ్రువీకరించినా, ప్లాంట్ పర్సనల్ అధికారి ధ్రువీకరణ కావాలని వారు ఒత్తిడి తెస్తున్నారన్నారు. ప్లాంట్ పర్సనల్ అధికారి సంతకం పెట్టేందుకు నిరాకరిస్తున్నారన్నారు. జనరల్ ఆస్పత్రి నుంచి రిఫర్ చేసిన రోగుల నుంచి ఆయా కార్పొరేట్ ఆస్పత్రులు టెస్టుల పేరిట సొమ్ము వసూలు చేస్తున్నారన్నారు. ఆస్పత్రి సమస్యలపై తమ యూనియన్, పర్సనల్, ఆస్పత్రి అధికారులతో సమావేశం ఏర్పాటు చేయాలని కోరారు. డైరెక్టర్‌ను కలిసిన వారిలో యూనియన్ గౌరవాధ్యక్షుడు జె.అయోధ్యరామ్, అధ్యక్షుడు వై.టి. దాస్, ప్రధాన కార్యదర్శి యు.రామస్వామి ఉన్నారు.

ప్రైవేటీకరణ ఆపేవరకూ ఉద్యమిస్తాం



దీక్ష శిబిరంలో మాట్లాడుతున్న పోరాట కమిటీ నాయకులు

కూర్మన్నపాలెం: స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణను నిలిపివేస్తున్నట్లు కేంద్రప్రభుత్వం ప్రకటించేంత వరకు ఉక్కు ఉద్యమం ఆపేది లేదని ఉక్కు పరిరక్షణ, పోరాట కమిటీ నాయకులు తెలిపారు. ఎన్నాళ్లయినా, ఎన్నేళ్లయినా ఉద్యమాన్ని కొనసాగిస్తామని స్పష్టం చేశారు. విశాఖ ఉక్కు కర్మాగారం ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా కూర్మన్నపాలెం కూడలిలోని స్టీల్‌ప్లాంట్ ఆర్చి వద్ద నిర్వహిస్తున్న రిలే నిరాహార దీక్షలు సోమవారం నాటికి 914వ రోజుకు చేరుకున్నాయి. దీక్ష శిబిరంలో ప్లాంట్‌లోని వివిధ విభాగాలకు చెందిన కార్మికులు, ఉక్కు నిర్వాసితులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా పోరాట కమిటీ నాయకులు మాట్లాడుతూ స్టీల్‌ప్లాంట్‌ను ప్రైవేటీకరిస్తే వచ్చే లాభాలను ప్రభుత్వరంగంలోనే కొనసాగిస్తూ కేంద్రప్రభుత్వం ఎందుకు సాధించలేదో తెలపాలని పేర్కొన్నారు. ప్రభుత్వం విధి ప్రైవేట్ వ్యక్తులతో కలిసి వ్యాపారం చేయడం కాదని, వాణిజ్యానికి ఊతమివ్వడమేనని అన్నారు. ప్రభుత్వరంగ సంస్థల మీద ఆధారపడి ఉన్న అనేక మంది కార్మికులు, శ్రామికులకు కేంద్ర ప్రభుత్వం సమాధానం చెప్పాలన్నారు. విశాఖ స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణ నిర్ణయాన్ని విరమించుకోకపోతే తీవ్ర పరిణామాలు తప్పవని హెచ్చరించారు. కార్యక్రమంలో పోరాట కమిటీ నాయకులు, కార్మికులు తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా వెంకన్న కల్యాణం



మాంగల్యధారణ ఘట్టం నిర్వహిస్తున్న అర్చకులు

సింహాచలం: వెంకటాద్రిపై సోమవారం వేంకటేశ్వర స్వామి కల్యాణం వైభవంగా జరిగింది. చాతుర్మాస పూజల్లో భాగంగా ఈ కార్యక్రమాన్ని విశేషంగా నిర్వహించారు. శ్రీదేవి,భూదేవిసమేతంగా వెంకన్న ఉత్సవమూర్తులను వేదికపై అధిష్ఠంపజేసి కల్యాణం శాస్త్రోక్తంగా నిర్వహించారు. భక్తులకు స్వామివారి ప్రసాదం అందజేశారు. ఆలయ ప్రధాన అర్చకుడు రామానుజమ్ ఆధ్వర్యంలో ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు.